ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

- బీఆర్ఎస్ యువత జిల్లా కార్యదర్శి నాయికోటి భాస్కర్

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని వినతి పత్రం ఇస్తున్న భాస్కర్

టేక్మాల్, నవంబర్ 11: కొన్న ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని బీఆర్ఎస్ యువత జిల్లా కార్యదర్శి నాయికోటి భాస్కర్, అదనపు కలెక్టర్ మంచు నగేశ్‌కు వినతిపత్రం అందజేశారు. టేక్మాల్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఐకేపీ, సొసైటీ, ఇతరత్ర నిర్వాహకుల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడం లేదన్నారు. లారీల కొరత కారణంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిలిచిపోయిందన్నారు. దీంతో తరుగు పెరిగి రైతులు నష్టాన్ని చూడాల్సిన పరిస్థితి ఉందన్నారు. టేక్మాల్‌లో 4వేల బస్తాల ధాన్యం ఉందని, లారీలు లేని కారణంగా నిలిచిపోయిందని పేర్కొన్నారు.

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

- అదనపు ఎస్పీ మహేందర్

ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, నవంబర్ 11: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని అదనపు ఎస్పీ మహేందర్ అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరించారు.

విద్యార్థులకు నగదు పురస్కారం

విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందిస్తున్న డీఈవో రాధాకిషన్

చిన్నశంకరంపేట, నవంబర్ 11: మండల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు ఎంఈవో పుష్పవేణి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం బాలికల పాఠశాలలో నిర్వహించిన రోల్‌ప్లేలో ఆదర్శ పాఠశాల మొదటి, మిర్జాపల్లిలో జడ్పీహెచ్ఎస్ రెండో బహుమతి గెలుచుకున్నారని పేర్కొన్నారు. విజేతలకు డీఈవో రాధాకిషన్ నగదు పురస్కారాన్ని అందజేసినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తూప్రాన్, నవంబర్ 11 : మనోహరాబాద్ సబ్ స్టేషన్ (132 కేవీ)లో మరమ్మత్తుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నది. తూప్రాన్ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని, వినియోగదారులు సహకరించాలని తూప్రాన్ మండల విద్యుత్ శాఖా ఏఈ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు వినియోగించుకోవాలి

రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన తహసీల్దార్ నారాయణ

చేగుంట, నవంబర్ 11: లయన్స్ క్లబ్ సేవలు వినియోగించుకోవాలని తహసీల్దార్ నారాయణ తెలిపారు. చేగుంటలో విశ్రాంత కార్యాలయంలో హైదరాబాద్ ఆయుస్మాన్ బ్లడ్ బ్యాంక్ వారితో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బుర్క నాగరాజు, ఆర్ఐ నర్సింగ్ యాదవ్, మాజీ సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్, వాలీబాల్ జిల్లా ఆసోసియేషన్ అధ్యక్షుడు అయిత పరంజ్యోతి, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కరణం నర్సింహులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

రామాయంపేట, నవంబర్ 11: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సగర యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మర్కు సురేశ్ స్కూలు బ్యాగులను సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మర్కు నగేశ్, రామారపు పోచయ్య, యాదగిరి, మర్కు భూమయ్య, సిద్ధరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలో పాల్గొన్న అదనపు కలెక్టర్ నగేశ్, అధికారులు

మెదక్ మున్సిపాలిటీ: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అజాద్ చిత్రపటానికి నివాళుర్పిస్తున్న నాయకులు

మెదక్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ): ప్రతి పేదవాడు ఉన్నత విద్యను అభ్యసించాలని భావించి, దానికి అనుగుణంగా తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ విద్యా సంస్థలు ఏర్పాటు చేశారని అదనపు కలెక్టర్ మెంచు నగేశ్ తెలిపారు. సోమవారం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాహిత్యం, విద్యా వికాసాలకు చిరస్మరణీయంగా కృషి చేసిన వ్యక్తిగా చరిత్రపుటలెక్కిన మహనీయుడని కొనియాడారు. విద్యారంగంలో శాస్త్ర, సాంకేతిక, స్త్రీ విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలను స్మరించుకోవాలన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, పాత్రికేయుడు, పండితుడు, కవిగా ఆయన చేసిన కృషికి గుర్తింపుగా 1992లో భారతరత్న పురస్కారం లభించిందన్నారు. విద్య నేర్చుకో విలువ పెంచుకో.. ఈ ప్రపంచాన్నే మార్చగలిగే శక్తి విద్యకు మాత్రమే ఉందన్నారు. ఆజాద్ జయంతి సందర్భంగా నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జమ్లా నాయక్, ఏవో యూనిస్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ అధికారి నాగరాజుగౌడ్, ఇంటర్మీడియట్ అధికారి మాధవి, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 11: దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతిని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు హఫీజోద్దీన్, రవి, అశోక్‌రెడ్డి, ముజీబ్, సలీం, సుఫీ, సిరాజ్, దేవ్లా, నాగిరెడ్డి, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్‌లో..

టేక్మాల్, నవంబర్ 11ః మండల కేంద్రమైన టేక్మాల్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ ప్రొటెక్షన్ కమిటి ప్రధాన కార్యదర్శి సలీం, బిఆర్ఎస్ జిల్లా యువత కార్యదర్శి నాయికోటి భాస్కర్, సొసైటీ డైరక్టర్ పాపయ్య, నాయకులు మజ్జర్, శేషు, ఎల్లయ్య,బాబా, దస్తగిరి, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర అభివృద్ధికి సర్వేతో దోహదం

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- సర్వేను పరిశీలించిన కలెక్టర్

సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పెద్దశంకరంపేట, నవంబర్ 11: సమగ్ర అభివృద్ధికి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి రాజకీయ ఇతర అంశాలకు సమగ్ర కుటుంబ సర్వే ఎంతగానో దోహదపడుతుందని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రగతి ప్రణాళికల రూప కల్పనకు జరుగుతున్న సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సమగ్ర సర్వేలో సేకరించిన డాటా ఎంట్రీ వివరాలను పకడ్బందీగా నిర్వహిస్తున్నామన్నారు. సర్వే మెటీరియల్ పటిష్ట భద్రతకు ట్రంక్ పెట్టెలో భద్రపర్చాలని ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించడానికి సర్వే చేపట్టిందన్నారు. కలెక్టర్‌తో తహసీల్దార్ గ్రేసీబాయి, ఎంపీడీవో రఫీకున్నీసా, డీటీ శ్రీనివాస్, ఈవో వెంకట్రాములు, తదితరులున్నారు.

వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి

- జడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్

శివ్వంపేట, నవంబర్ 11: నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిపై వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని జడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మన్సూర్ తెలిపారు. సోమవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేసిన రైతు దీక్షకు ప్రజల నుంచి వచ్చిన స్పందనను కాంగ్రెస్ నాయకులు తట్టుకోలేక ఎమ్మెల్యేపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారన్నారు. వాటిని మాని రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ఆరు గ్యారంటీలని చెప్పి గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి ఏఒక్క హామీని నెరవేర్చకపోవడం దారుణమన్నారు. పంట పెట్టుబడి సాయం రైతుభరోసా ఊసే లేదని, కల్యాణ లక్ష్మిలో తులం బంగారం కానరావడం లేదని ఎద్దేవా చేశారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

మెదక్ మైదానంలో మార్చ్‌పాస్ట్ నిర్వహిస్తున్న విద్యార్థినులు

- మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్
- మెదక్‌లో అట్టహాసంగా 10వ రాష్ట్రస్థాయి జోనల్ స్పోర్ట్స్‌మీట్

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 11: విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. సోమవారం మెదక్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 10వ రాష్ట్రస్థాయి జోనల్ స్పోర్ట్స్ మీట్ అట్టహాసంగా ప్రారంభమైంది. ఈ మీట్‌లో రాజన్న సిరిసిల్ల జోన్ పరిధిలోని రాజన్న సిరిసిల్ల, మెదక్, కరీంనగర్, కామారెడ్డి, సిద్దిపేట జిల్లాలకు చెందిన 13 గురుకుల పాఠశాలలకు చెందిన 1,105 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను డీఎస్పీ, కో ఆర్డినేటర్ సువర్ణలత క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. క్రీడలు శారీరకంగా, మానసికోల్లాసానికి ఉపయోగపడుతాయన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలన్నారు. పోటీలు ఈనెల 14వ తేదీ వరకు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో పట్టణ సీఐ నాగరాజు, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వేకు సమయం పొడిగించాలి

వినతిపత్రం అందజేస్తున్న నేతలు

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 11: సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యూమరేటర్లకు సమయం పొడిగించాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు రాజగోపాల్‌గౌడ్, ఎల్లం, వెంకట్రాంరెడ్డి, లక్ష్మణ్, మాధవరెడ్డి సోమవారం అదనపు కలెక్టర్ నగేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఒక్కో ఇంటికి అర్ధ గంటకు పైగా సమయం పడుతున్నదని, దీంతో రోజుకు 7, 8 ఇండ్లు మాత్రమే పూర్తవుతున్నాయన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

నిజాంపేట, నవంబర్ 11: మండల వ్యాప్తంగా సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతున్నది. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేస్తున్నారు. సోమవారం మండలంలోని రాంపూర్, చల్మెడ గ్రామాల్లో సర్వేను మండల ప్రత్యేకాధికారి గోవింద్ పరిశీలించారు. ఆయనతో ఎంపీడీవో రాజిరెడ్డి, ఎంపీవో ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి నర్సింహారెడ్డి ఉన్నారు.

టేక్మాల్‌లో..

టేక్మాల్, నవంబర్ 11: మండలంలోని ఎల్లంపల్లి గ్రామంలో ఇంటింటి సర్వేను డీపీవో యాదయ్య పరిశీలించారు. ఎన్యూమరేటర్లు కుటుంబాల నుంచి సేకరించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. తప్పులు జరగకుండా పకడ్బందీగా వివరాల నమోదు చేయాలని సూచించారు.

అల్లాదుర్గంలో..

అల్లాదుర్గం, నవంబర్ 11: మండలంలోని ఆయా గ్రామాల్లో సర్వేను పక్కాగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి కరుణ పేర్కొన్నారు. పలు గ్రామాల్లో చేస్తున్న సర్వేను పరిశీలించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, సూపరింటెండెంట్ శంకర్ యాదవ్, డిప్యూటీ తహసీల్దార్ ఇమ్రాన్ ఉన్నారు.

కౌడిపల్లిలో..

కౌడిపల్లి, నవంబర్ 11: ధర్మాసాగర్‌లో సర్వేను డీఎల్‌పీవో యాదయ్య, ఆర్డీవో మహిపాల్‌రెడ్డి వేర్వేరుగా పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో కరీముల్లా ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య

చిన్న శంకరంపేట, నవంబర్ 11: ప్రభుత్వ కళాశాలలోనే నాణ్యమైన విద్య అందిస్తున్నారని ప్రిన్సిపాల్ శశిధర్ తెలిపారు. సోమవారం కళాశాల ఒకేషనల్ విద్యార్థులకు ఆన్ జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా పట్టణంలోని ఏపీజీవీబీ, డీసీసీబీ బ్యాంకుల లావాదేవీలపై అవగాహన కల్పించారు. బ్యాంకుకు వచ్చే ఖాతాదారులకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. అధ్యాపకులు లక్ష్మీపతి, శ్రీవాణి, విక్రమ్, ఇంద్రారెడ్డి, తిరుపతి పాల్గొన్నారు.

మెదక్ అర్బన్: రక్తదానం చేస్తున్న సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్

రక్తదానం మహాదానం: జిల్లా జడ్జి

మెదక్ అర్బన్, నవంబర్ 11: రక్తదానం మహాదానం అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.లక్ష్మీశారద అన్నారు. సోమవారం జిల్లా న్యాయస్థానాల సముదాయంలో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ అత్యవసర సమయంలో రక్తదానం చేయడంతో ఒక నిండు ప్రాణాన్ని కాపాడిన వారు అవుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్, మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్‌చంద్రగౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీపతిరావు, న్యాయవాదులు పోచయ్య, జనార్దన్‌రెడ్డి, కరుణాకర్, శ్రీనివాస్‌గౌడ్, రవిగౌడ్ పాల్గొన్నారు.

కొప్పోల్‌లో జిల్లా జడ్జి పూజలు

పెద్దశంకరంపేట,నవంబర్ 11: కార్తిక సోమవారాన్ని పురస్కరించుకొని కొప్పోల్ ఉమా సంగమేశ్వర ఆలయంలో జిల్లా జడ్జి లక్ష్మి శారద స్వయంభు లింగానికి పూజలు చేశారు. ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో శివలింగానికి జలాభిషేకాలు చేసి దీపాలు వెలిగించారు. ఆమె వెంట జిల్లా లీగల్ సర్వీసెస్ సెక్రటరీ జితేందర్ ఉన్నారు.

గ్రూప్-3ని విజయవంతంగా నిర్వహించాలి

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేశ్

- జిల్లాలో 19 పరీక్షా కేంద్రాలు
- గంటన్నర ముందు నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి
- అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 11: ఈనెల 17, 18వ తేదీల్లో గ్రూప్-III పరీక్షను సమన్వయంతో విజయవంతంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేశ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో గ్రూప్-III పరీక్షపై అదనపు ఎస్పీ మహేందర్, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా నగేశ్ మాట్లాడుతూ జిల్లాలో 5,867 మంది పరీక్ష రాయనున్నారని, అభ్యర్థులకు అనుగుణంగా జిల్లాలో 19 పరీక్షా కేంద్రాలు (మెదక్ సబ్ డివిజన్‌లో 12, తూప్రాన్ సబ్ డివిజన్‌లో 7 పరీక్షా కేంద్రాలు) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఈ పరీక్ష కోసం ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ఆరుగురు రూట్ అధికారులు, 19 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించినట్లు వివరించారు. కేవలం చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరూ పరీక్ష కేంద్రంలోకి సెల్ ఫోన్ తీసుకెళ్లొద్దన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో మహిళలు, పురుషులకు వేర్వేరుగా తనిఖీ గదులు ఏర్పాటు చేయాలని ఆధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అనంతరం అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ 19 పరీక్షా కేంద్రాలకు 16 లోకేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక్కో పరీక్షా కేంద్రానికి ఐదుగురు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరీక్షా సమయానికి గంటన్నర ముందే అభ్యర్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారన్నారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

విద్యార్థి చేతిపై మంటలు లేపుతున్న నరేశ్

నర్సాపూర్, నవంబర్ 11: మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జాతీయ కమిటీ సభ్యుడు ఉప్పులేటి నరేశ్ తెలిపారు. నర్సాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్, భౌతిక శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం-సైన్స్-మూఢనమ్మకాల నిర్మూలన అంశంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ దొంగస్వాములు, భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా, సామాజికంగా మోసం చేస్తున్నారన్నారు. మాంత్రికులు, భూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దామోదర్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ సురేశ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉచిత వైకుంఠరథం ప్రారంభం

వైకుంఠరథాన్ని ప్రారంభిస్తున్న పాలకవర్గం

రామాయంపేట, నవంబర్ 11: పట్టణ ప్రజల అవసరాల కోసం పురపాలిక నుంచి వైకుంఠరథాన్ని ఉచితంగా అందజేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి తెలిపారు. సోమవారం ఉచిత వైకుంఠరథాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, బొర్ర అనిల్ కుమార్, చింతల రాధాభవాని, సుందర్ సింగ్, దేమె యాదగిరి, మల్యాల కవిత, యాదగిరి, కొండల్‌రెడ్డి ఉన్నారు.

పేదలకు 'గ్రోస్' నిత్యావసరాల పంపిణీ

సరుకులు పంపిణీ చేసున్నకోటేశ్వర్‌రావు

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 11: గ్రోస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 34 కుటుంబాలకు ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ కోటేశ్వర్‌రావు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గ్రోస్ సంస్థ నిర్వాహకుడు జాయ్ ముర్రే, జోయల్, ఆనందిసింగ్ పాల్గొన్నారు.

గోడ కూలి ఇద్దరు కూలీలు మృతి

వాసిక్‌కూల్ ఆలం, రఫీక్ ఆలం (ఫైల్)

చిన్నశంకరంపేట, నవంబర్ 11: నిర్మాణంలో ఉన్న కోళ్లఫారం గోడ కూలి ఇద్దరు కూలీలు మృతి చెందిన ఘటన మండలంలోని కామారం తండాలో సోమవారం జరిగింది. ఎస్సై నారాయణ తెలిపిన వివరాల .. జార్ఖండ్ రాష్ట్రం బాస్నా గ్రామానికి చెందిన వాసిక్ కూల్ ఆలం(27), రఫీక్ ఆలం(20) కొన్ని నెలల క్రితం చిన్నశంకరంపేటకు వలస వచ్చారు. పారిశ్రామిక వాడలో ఏదైనా కూలి పనులు చేసుకొని జీవించాలని అనుకున్నారు. కామారం తండాలో ఏనుగు సాయి బాబారెడ్డి కోళ్లఫారం నిర్మిస్తున్నారు. కోళ్ల ఫారం గోడను నిర్మించేందుకు కూలీకి వెళ్లారు. గోడ నిర్మిస్తుండగా ప్రమాదవశాత్తు కూలి ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు కూలీలు నసీం, అక్బర్, ఇంతసార్ ఆలంకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చేగుంటలోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. ఈ కోళ్ల ఫారానికి గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు లేవని అధికారులు తెలిపారు. ఘటనా స్థలాన్ని రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్ పరిశీలించారు. ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని ఎస్సై తెలిపారు. మృతదేహాలను రామాయంపేట ఏరియా దవాఖానకు తరలించి, మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు.

గోడమీది నుంచి పడి బీహారీ మృతి

అభిమన్యు మృతదేహం

చేగుంట, నవంబర్ 11: ప్రహారీపై నుంచి దూకి యువకుడు మృతి చెందిన ఘటన చేగుంట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెన్‌కాబ్ పరిశ్రమ వద్ద జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వెన్‌కాబ్ పరిశ్రమలో పావురాలను ఎత్తుకెళ్లేందుకు వెళ్లిన బీహార్ రాష్ట్రానికి చెందిన అభిమన్యు(20) ప్రహారీపై నుంచి కిందికి దూకాడు. దీంతో కింద ఉన్న బండరాతిపై పడి అభిమన్యు అక్కడికక్కడే మృతి చెందాడు. అభిమన్యు మృతదేహంతో స్థానికులు ఆందోళన చేయడంతో సీసీ కెమరాలు పరిశీలించారు. అభిమన్యు పావురాలను దొంగలించడానికి వచ్చినట్లు నిర్ధారణ కావడంతో వెన్‌కాబ్ పరిశ్రమ యాజమాన్యం చేగుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

వేణుగోపాల్ (ఫైల్)

చేగుంట, నవంబర్ 11: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన చేగుంట మండలం రెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన వడ్డెపల్లి వేణుగోపాల్ (32)హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఆరు నెలలుగా పనిచేస్తున్నాడు. సోమవారం తన రూం ఖాళీ చేసి, మిత్రుడు రంజిత్‌తో కలిసి స్కూటీపై హైదరాబాద్ నుంచి చిన్న మల్లారెడ్డి గ్రామానికి తిరిగి వస్తున్నాడు. మక్కరాజిపేట బ్రిడ్జి సమీపంలో డిసీఎం రాంగ్ రూట్‌లో వచ్చి స్కూటీని తగిలింది. దీంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో వేణుగోపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. రంజిత్‌కు తీవ్రగాయాలయ్యాయి. మృతుడి తండ్రి పెంటయ్య ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

అనిత (ఫైల్)

టేక్మాల్, నవంబర్ 11: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన టేక్మాల్ మండలంలోని చెరువుముందరి (సీఎం)తండాలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరువు ముందరి తండాకు చెందిన రాత్ల అనిత (28) భర్త నార్యా నాయక్ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వారం రోజులుగా పొగురువారితో గొడవలు జరిగాయి. ఈ క్రమంలో అనిత ఈ నెల 9న పురుగు మందు తాగింది. దీంతో సంగారెడ్డి దవాఖానకు తరలించారు. 10న దవాఖాన నుంచి వచ్చిన అనంతరం మళ్లీ గొడవకు దిగారు. దీంతో అదే రోజున రాత్రి లో ఇంట్లో ఎవరు లేని సమయంలో అనిత అనుమానాస్పదంగా మృతి చెందింది. పొరుగువారే తన భార్యను కొట్టి చంపారని భర్త ఆరోపించాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు తండాలో ఎలాంటి ఉద్రిక్తత చోటు చేసుకోకుండా సీఐ రేణుక, ఎస్సై రాజేశ్ ఘటనా స్థలానికి చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమత్తం జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

జంగం